క్లుప్తంగా

మెడికల్ కాలేజీలో సీటు సాధించిన విద్యార్థిని


తండ్రి నరసింహారావుతో సాయి వాసవీ

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని మెడికల్ సీటు సాధించింది. మండలంలోని గ్రామానికి చెందిన మాదాసు నరసింహారావు కుమార్తె మాదాసు సాయి వాసవి నీట్ 2024లో 331వ ర్యాంకు సాధించింది. నీట్‌లో 720 మార్కులకుగాను 662 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 331వ ర్యాంకు, ఆల్ ఇండియా స్థాయిలో 17541వ ర్యాంకు సాధించి విశాఖలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో ప్రభుత్వ సీటు పొందింది. సాయి వాసవీ 6 నుంచి 10 వ తరగతి వరకు కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ విజయవాడలోని ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీలో విద్య నభ్యసించి అక్కడ నుంచి నీట్ పరీక్షకు హాజరై ప్రభుత్వ కాలేజీలో సీటు సాధించింది. ఆమె సీటు సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తదితరులు అభినందనలు తెలిపారు.

పరిశుభ్రతను పాటిద్దాం


జాతీయ రహదారిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

కారంచేడు: భారత రహదారి, రవాణా మంత్రిశాఖల సంయుక్త సహకారంతో స్వభావం స్వచ్ఛత-సంస్కారం స్వచ్ఛత అనే నినాదంతో ఈనెల 14వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు పరిశుభ్రతను పాటించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన కారంచేడు కాలువ సెంటర్, సాయినగర్, మద్య బస్టాండ్ సెంటర్, పోలీస్టేషన్, అంబేడ్కర్‌నగర్ కాలనీ ప్రాంతాలలోని జాతీయ రహదారికి ఇరువైపులా పరిశుభ్రతను పాటించేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు కూడా తమ వంతు చేతులేసి గ్రామంలోని అనేక ప్రాంతాలను శుభ్రం చేశారు.


కుంకలమర్రు వద్ద ఆయిల్ ఇంజన్లతో నీటిని పంప్ చేస్తున్న రైతులు


ఐదడుగుల నీటిమట్టంతో ప్రవహిస్తున్న కొమ్మమూరు కాలువ

రైతుల ఆశలకు బీటలు

- అతివృష్టి, అనావృష్టితో అన్నదాతల ఆందోళన
- ఇంజన్లపైనే ఆధారపడుతున్న రైతన్నలు
- సాగునీటికే రూ.3 కోట్ల వరకు ఖర్చు
- కొమ్మమూరు ఆయకట్టు రైతుల దీనస్థితిపై కథనం

కారంచేడు:

ఖరీఫ్ సీజన్‌ను నమ్ముకుంటే వరుణ దేవుడు నట్టేటా ముంచాడు. పోనీ రబీ సీజన్‌లో అయినా పంటలు బాగా పండుతాయిలే అనుకొని సాగుచేస్తే తీర పంట చేతికొచ్చేసరికి వరుణ దేవుడు ఆగ్రహించి కుంభవృష్టి కురిపించి నాశనం చేశాడు. అప్పుడు నాశనమే.. ఇప్పుడూ నాశనమే అని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. పోని కూటమి ప్రభుత్వం ఏదైనా సాయం చేయకపోదా అని అనుకుంటున్న తరుణంలో ఆ ఆశకూడా నెరవేరే దారి కనిపించడం లేదు.

అతివృష్టి.. అనావృష్టిలో పంటలకు నష్టం..

గత నెలాఖరు వరకు మంచి వర్షాలు పడటంతో పాటు సాగునీటి కాలువల్లో అవసరమైన నీటి పరిమాణం ఉండటంతో అన్నదాతలు ఆనందంగా సాగును ప్రారంభించారు. కొంత భూముల్లో వెద పద్ధతుల్లో సాగు చేయగా అప్పుడు ఈ నెల మొదటి వారంలో కురిసిన అధిక వర్షాల వలన కొన్ని చేలల్లో నీరు నిలబడి మొక్కలు కుళ్లిపోయాయి. వాటిని తట్టుకొని ముందుకు వచ్చిన చేలల్లో ప్రస్తుతం నీరు లేక భూములు బీటలు వారుతున్నాయి. వెద పద్ధతుల్లో సాగు చేసిన భూముల్లో నీరు లేక ఎండిపోతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. కారంచేడు ఉత్తర పొలాలు, దక్షిణ ప్రాంత పొలాల్లో నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్తున్నారు.

కొమ్మమూరు కాల్వ ఆదుకునేనా.. !

వ్యవసాయ రంగంలో రోజురోజుకు యంత్రాలు వినియోగం పెరిగిపోతుంది. సాగుకు ప్రారంభమై దుక్కులు, దమ్ముల నుంచి కోతలు, నూర్పిళ్లు అన్నీ ఆధునీకరణ యంత్రాలతోనే సాగిస్తున్నారు. సాగుకు ఖర్చులు అధికమైనా తప్పడం లేదు. దీనికి తోడు అడ్డూ అదుపూ లేని డీజిల్ ధరలు అన్నదాతలకు పెను భారంగా మారుతున్నాయి. అన్నదాతలను ఆదుకుంటామని ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకోవడమే వారికి అసరమైన విత్తనాలు, సాగునీరు, ఎరువులు, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో మాత్రం ఎప్పటికప్పుడు ఘోరంగా విఫలమవుతూనే ఉన్నారు. జిల్లా ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు ప్రాంతంలో రైతన్నలు వరి సాగుకు సన్నద్ధమయ్యారు. ఈ ప్రాంతంలో ప్రధాన సాగు నీటి వనరులైన కొమ్మమూరు కాలువ కింద సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు చేసేందుకు అన్నదాతలు పనులు ప్రారంభించారు. చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని కారంచేడు, చినగంజాం, వేటపాలెం, చీరాల, పర్చూరు, నాగులుప్పలపాడు మండలాలల్లో ఇప్పటికే వరి సాగుకు అన్నదాతలు సన్నద్ధమయ్యారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో కొన్ని చేలల్లో దమ్ములు చేస్తుండగా మరి కొన్ని చేలల్లో నార్లు పోయడం, నాట్లు వేయడం వంటి పనులు ప్రారంభిస్తున్నారు. వెద పద్ధతుల్లో సాగు చేయడం వంటివి ప్రారంభిచారు. దమ్ములకు, నాట్లకు నీరు అవసరం. ప్రస్తుతం కొమ్మమూరు కాలువలో కేవలం 4.5 అడుగులు నుంచి 5 అడుగుల మాత్రమే నీరు వస్తుందిని దీని వలన దిగువ పొలాలకు నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. కనీసం 6.5 నుంచి 7 అడుగుల మేర నీటి ప్రవాహం ఉంటే గాని దిగువ ప్రాంత పొలాలకు నీరు అందే పరిస్థితి ఉండదని రైతులు చెప్తున్నారు. నీరు పెట్టుకొనేందుకు అన్నదాతలు ఆయిల్ డీజిల్ ఇంజన్లను ఆశ్రయించాల్సి వస్తుంది. కుంకలమర్రు నుంచి ఉప్పుగుండూరు వరకు సుమారు 90కి పైగా ఆయిల్ ఇంజన్లు రైతులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతిరోజు ఒక్కో ఇంజన్ నిర్వహణకు సగటున 30 లీటర్ల డీజిల్ అవసరమవుతుంది.


కారంచేడు ప్రాంతంలో బీటలు వారుతున్న వరి చేలు

సాగునీటికి రూ 2.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఖర్చు..

సాగునీటిని పొలాలకు మళ్లించుకొనేందుకు అన్నదాతలు ఏకంగా రూ.2.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. కారంచేడు ప్రాంతంలో ఎక్కువగా ప్రైవేటు పంపులను ఏర్పాటు చేసుకొని ఒక్కో పంపు కింద సుమారు 300 ఎకరాలు నుంచి 800 ఎకరాల వరకు సాగు చేస్తుంటారు. పంపుల నిర్వహణలో భాగంగా రైతుల నుంచి సాగునీటి ఖర్చుల కోసం ఈ ఏడాది ఎకరానికి రూ 2500 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేశారు. ఈ లెక్కన కొమ్మమూరు ఆయకట్టు కింద సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు జరుగుతుంటే కేవలం సాగునీటి ఖర్చులకే రూ 2.5 కోట్ల నుంచి రూ 3 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు చెప్తున్నారు. ఎగువన ఉన్న కారంచేడు ప్రాంతంలోని భూములకే సాగునీరు సక్రమంగా అందడం లేదంటే దిగువన ఉన్న చినగంజాం, నాగులుప్పలపాడు ప్రాంతంలో సాగునీటి ఖర్చు మరింత పెరిగే అవకాశం లేకపోలేదని వారు అంటున్నారు.

పెరిగిన సాగు ఖర్చులు..

గత ఏడాదితో పోల్చుకుంటే ఈ సంవత్సరం సాగుకు ఖర్చు పెరిగిందని సన్న చిన్నకారు రైతులు వాపోతున్నారు. గత ఏడాది కంటే ఇప్పుడు కౌలు రేట్లు పెరిగాయి. సాగుకు అవసరమైన నీరు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇంజన్లతో పెట్టుకోవడం. ఈ ఏడాది వాతావరణం అనుకూలించి కాలువల్లోకి కొంత నీరు వచ్చింది. గతంలో ఎకరా కౌలు 12-15 బస్తాలు ఉంటే, ప్రస్తుతం కొన్ని చోట్ల 17-20 బస్తాలు నడుస్తుంది. గతంలో ఎకరా సాగుకు రూ.15-18 వేలు ఖర్చు అయితే ప్రస్తుతం పెరిగిన ధరలను బట్టి రూ.20-25 వేల వరకు అవుతుందని అంచనా వేస్తున్నారు.

కొమ్మమూరు కాలువకు 6.5 అడుగుల నీటిమట్టం ఇవ్వాలి..



కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద సుమారు లక్ష ఎకరాల వరకు వరి సాగు ఉంది. సాగునీటికి ఎలాంటి ఆటంకం లేకుండా ఉండాలంటే కనీసం 6.5 అడుగుల నుంచి 7 అడుగుల నీటిమట్టంను ఇవ్వాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 4.5 అడుగుల నుంచి 5 అడుగుల నీటిమట్టం మాత్రమే ఉంటుంది. దీని వలన రైతులు తాము సాగు చేసిన వరి చేలను బతికించుకోవడానికి ఆయిల్ ఇంజన్లను ఆశ్రయించాల్సి వస్తుంది. దీని కోసం రైతులకు ఎకరానికి రూ.2500 నుంచి రూ.3 వేల వరకు అదనపు భారం పడుతుంది.

– యార్లగడ్డ సుబ్బారావు, రైతు, కారంచేడు

పెరిగిన సాగు ఖర్చులు, నీటి ఖర్చులు..



ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సాగు ఖర్చులతో పాటు, సాగునీటి ఖర్చులు కూడా పెరిగిపోయాయి. నేను కొంత సొంత భూమితో పాటు కౌలు భూమిని తీసుకొని 10 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నాను. గత వారంలో కురిసిన అకాల వర్షాలతో కొమ్మమూరు కాలువకు పైన గండ్లు పడ్డాయని చెబుతున్నారు. అవసరమైన సాగునీరు అందకపోవడంతో ఇంధన బారం మోయాల్సి వస్తుంది. రైతుల సమస్యలను గుర్తించి అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

– జెట్టి వెంకటేశ్వర్లు, రైతు, కుంకలమర్రు

పోటాపోటీగా వినాయక నిమజ్జనాలు


వాడరేవులో నిమజ్జనానికి తీసుకొస్తున్న భక్తులు


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో ఉన్న వాహనం, స్వామివార్లు


ఈపురుపాలెంలో యువకులకు సూచనలందిస్తున్న రూరల్ ఎస్సై


మార్టూరులో ఊరేగింపులో సంపత్ నగర్ కాలనీ వినాయకుడు

చీరాల టౌన్: గణపతి బప్పా మోరియా బైబై గణేషా అంటూ భక్తులు గణనాథుళ్లని గంగఒడికి చేరుస్తున్నారు. వినాయకచవితి పండుగను పురస్కరించుకుని చలువ పందిళ్లల్లో ఏర్పాటు చేసిన గణనాథులు నిమజ్జనాలకు సోమవారం కూడా వాడరేవుకు తరలివచ్చాయి.

కారంచేడు: వినాయక నిమజ్జన కార్యక్రమాలను ఒకరికొకరు భక్తిశ్రద్ధలతో పాటు, పోటా పోటీలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. మండల కేంద్రం కారంచేడు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను తరలించేందుకు ఏర్పాటు చేసే వాహనాలను సైతం ప్రత్యేకంగా పూలతో అలంకరించి గ్రామోత్సవాలను నిర్వహించారు. స్వర్ణ గలభపేటకు చెందిన యువకులు సైతం రాత్రి అంతా గ్రామోత్సవాన్ని నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.

మార్టూరు: స్థానిక సంపత్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాన్ని కాలనీ వాసులు సోమవారం సాయంత్రం గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి బొల్లాపల్లి సాగర్ కాలువలో నిమజ్జనం నిర్వహించారు.

పంట ధ్వంసంపై కేసు

అద్దంకి రూరల్: మినప పంటను ధ్వసం చేసి దాడిచేసిన వారిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం ఎస్సై ఖాదర్‌బాషా కేసు నమోదు చేశారు. ఎస్సై వివరాల మేరకు.. మండలంలోని వెంపరాల గ్రామానికి చెందిన తూమాటి కుమారి తన మామ ద్వార వచ్చిన పొలంలో మిరప పంట మేసుకుని తన భర్త, మరిదిలు పొలంలో పనులు చేసుకుంటున్నారు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన యద్లవల్లి రాణి, తూమాటి దిబ్బయ్య, వజ్రయ్య పొలంలోకి వచ్చి అసభ్యకరంగా మాట్లాడుతూ కర్రలతో దాడి చేసి పంటను నాశనం చేశారు. ఈమేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

బైక్ ప్రమాదంపై కేసు

అద్దంకి రూరల్: బైకు ఢీకొట్టిన ఘటనలో క్షతగాత్రుడు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఖాదర్ వలి కేసు నమోదు చేశారు. ఎస్సై వివరాల మేరకు.. స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న గద్దల రవికుమార్ ఆదివారం రాత్రి తన ఇంటికి బైక్‌మీద ఇంటికి వెళ్తుండగా స్థానిక కలవకూరు రోడ్డు జంక్షన్ వద్ద నున్న బజాజ్ షోరూమ్ వద్దకు రాగా వెనుక వస్తున్న బైకు ఢీకొట్టింది. ఈ ఘటనలో రవికుమార్‌కు గాయాలవటంతో స్థానికులు అద్దంకి వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

బాధిత కుటుంబానికి చేయూత


సాయం అందిస్తున్న సంఘ సభ్యులు

అద్దంకి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఉద్యోగులు అండగా నిలిచారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన హలో మాల, చలో ఒంగోలు కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. అతను కందుకూరు గ్రామంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన జెట్టి అరిస్టాటిల్. ఆ కుటుంబాన్ని సోమవారం అద్దంకికి చెందిన ఉద్యోగ, మాల సంఘాల నాయకులు, ఏపీ ఎస్సీ ఎస్టీ బీసీ అండ్ మైనారిటీస్ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీమన్నారాయణ మూర్తి, సభ్యులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో సంఘ సభ్యులు జగన్నాథం యోహాను, మద్దుమాల పుల్లారావు, ఇస్తర్ల వెంకట సుబ్బారావు, నల్లపు చంద్రశేఖర్, పూరిమెట్ల హరినారాయణ ఉన్నారు. వీరంతా కందుకూరులోని అరిస్టాటిల్ ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి దాతలు అందించిన రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అరిస్టాటిల్ అమ్మగారికి, తమ్ముడు ఎడిసన్‌కు అందించారు.

మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం


పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పర్చూరు (చినగంజాం): మహమ్మద్ ప్రవక్త జీవతం అనుసరణీయమని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. పర్చూరులో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరుపుకునే మిలాద్ ఉన్ నబీ పండుగను స్థానిక అతహర్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరుపుకున్నారు. సోమవారం ముస్లింలు స్థానిక మసీదులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మసీదు మౌలానా మాట్లాడుతూ ఇస్లాం మతాన్ని ప్రపంచం అంతా చాటి చెప్పిన గొప్ప వ్యక్తి మహమ్మద్ ప్రవక్త అని కొనియాడారు. ఇతరులకు సహాయ పడాలన్న ప్రవక్త సందేశాన్ని ఆయన అందరికీ వినిపించారు. దానధర్మాలు చేసి అన్యమతస్తుల మన్ననలు పొందాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ అహ్మద్ బాషా, షేక్ కాలేషా, యాసిన్ బాషా, షేక్ సుభాని, షేక్ మస్తాన్ వలి, మబ్బుల్ సర్దార్, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం


స్టేషన్ ముందు నిలిపిఉన్న ట్రాక్టర్లు, టైరుబండ్లు

చీరాల టౌన్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, రెండు టైరు బండ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై శివకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గవినివారిపాలేనికి చెందిన అయ్యప్ప, బ్రహ్మం అనే ఇద్దరు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు గవినివారిపాలెంలో రెండు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు. అలానే ఈపురుపాలెం, తోటవారిపాలెం ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను టైరు బండ్ల ద్వారా తరలిస్తూ అమ్మకాలు చేస్తున్న మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు కరకట్టలు, ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఇసుకను తవ్వినా, అమ్మకాలు చేసిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

వరద బాధితులకు విరాళం అందజేత


విరాళాన్ని ఎంపీకి అందిస్తున్న స్కూల్ యాజమాన్యం

చీరాల: విజయవాడ వరద బాధితుల సహాయార్థం చీరాలలోని రాఘవేంద్ర ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం సేకరించిన రూ.50 వేల నగదును సోమవారం బాపట్ల ఎంపీ కార్యాలయంలో లోక్‌సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు అందించారు. సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి వరద బాధితులకు అండగా నిలిచిన స్కూల్ యాజమాన్యానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ గవిని మణికుమార్, ఉపాధ్యాయులు సురేష్, సుభాని, వెంకట్ పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవా

చినగంజాం: మండలంలోని గ్రామ పంచాయతీల్లో నేటి నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ప్రతి రోజు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కే స్వరూపరాణి తెలిపారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, గ్రామీణ నీటి పారుదల ఇంజనీర్, ఉపాధి హామీ ఏపీఓ, ఐకేపీ ఏపీఎంలు, గ్రామ స్థాయిలో సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ సభ్యులు, గ్రామ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాలు, వీడబ్ల్యూఎస్‌సీ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొనాలని సూచించారు.

పేద పిల్లలకు దుస్తులు పంపిణీ


బాలికలకు దుస్తులు అందజేస్తున్న నబీ షా

చినగంజాం: మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని చినగంజాంకు చెందిన దాత నబీ షా పేద పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు, మసీదు ప్రెసిడెంట్ అయిన నబీ షా తన కుమార్తె అయిషాతో కలిసి జాలమ్మ కాలనీలో నివాసముంటున్న పలువురు పేద బాలికలకు అందరికీ సోమవారం నూతన దుస్తులు, స్వీట్లు అందజేశారు. కాలనీకి చెందిన మానికల సుబ్రహ్మణ్యం కుటుంబంలోని బాలికలతో పాటు మిగిలిన కుటుంబాలలోని బాలికలందరికీ వాటిని అందజేశారు. ప్రతి ముస్లిం పేదవారికి సహాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఘనంగా త్రివిక్రమస్వామి పవిత్రోత్సవాలు


స్వామి వారి ఉత్సవ విగ్రహాలు


స్వామి వారిని ఊరేగిస్తున్న పండితులు

పర్చూరు(చినగంజాం): మండలంలోని చెరుకూరు గ్రామంలో వేంచేసియున్న త్రివిక్రమ స్వామి దేవస్థానంలో స్వామి వారి పవిత్రోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామి వారికి నిత్య కైంకర్య హోమంతో మొదలు పెట్టి అనంతరం స్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో చెరుకూరు మాజీ జెడ్పీటీసీ రామకృష్ణ దంపతులు పాల్గొని కైంకర్య పూజలు నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తిరుపతి నుంచి విచ్చేసిన భావన్నారాయణ స్వామి బృందం కల్యాణాన్ని కనుల విందుగా నిర్వహించారు.

భక్తులకు అన్నదానం


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న నిర్వాహకులు

చీరాల అర్బన్: పట్టణంలోని విఠల్‌నగర్‌లో రెడ్డికా యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గణనాధునికి ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత 24 ఏళ్లుగా క్రమం తప్పకుండా గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. 11 రోజులు పాటు స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సోమవారం వినాయకచవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వేతన కమిటీ రిపోర్టు బయటపెట్టాలి

చీరాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు 12వ వేతన కమిటీ రిపోర్టును బయట పెట్టి అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పేరాలలోని కార్యాలయంలో జరిగిన మధ్యతరగతి శాఖ మహాసభలో పాల్గొని ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన వేతనం, అలవెన్సులో బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. చీరాల ట్రెజరీ కార్యాలయంలో అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో ఐవీ ప్రసాద్, సీపీఎం చీరాల కార్యదర్శి ఎన్.బాబూరావు, సభ్యులు డి.నారపరెడ్డి, బి.అజయ్, కె.యల్లమంద పాల్గొన్నారు.